సాక్షి ఒడిశా

సోమవారం । 14 । ఏప్రిల్ । 2025



వాహనం బోల్తా

పాడేరులో ఓ వాహనం బోల్తా పడింది. ఒడిశా వాసులు గాయపడ్డారు.

- 8లో



సంగీత విభావరి

పర్లాకిమిడిలో సంగీత విభావరి ఘనంగా జరిగింది. గీతాలు ఆకట్టుకున్నాయి.

- 8లో



అదరగొట్టిన కళాకారులు

జయపురం కళాకారులు అదరగొట్టారు. పోటీల్లో ప్రతిభ చూపారు.

- 8లో

న్యూస్‌రీల్

జూన్ 2 నుంచి బురదల పోలమ్మ ఉత్సవాలు



బురదల పోలమ్మ అమ్మవారు

రాయగడ: గ్రామ దేవతగా పూజలందుకుంటున్న స్థానిక భైరవ వీధిలో బురదల పోలమ్మ ఉత్సవాలు జూన్ 2 నుంచి ప్రారంభమవుతాయి. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు శనివారం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా బార్జి జగన్మోహన్ రావు, ఉపాధ్యక్షులుగా ఎద్దు శ్రీహరి, కోశాధికారిగా బొచ్చ శ్రీనివాసరావు, పలువురు సభ్యులు నియమితులయ్యారు.

జగన్నాథ్ ఎక్స్‌ప్రెస్ బస్సుసర్వీసు ప్రారంభం



చందాహండిలో ప్రారంభమైన బస్సు

కొరాపుట్: రాష్ట్రంలో చివరి సమితి నబరంగ్‌పూర్ జిల్లా చందాహండి నుంచి బ్రహ్మపురకు ఓఎస్ఆర్‌టీసీ ఆదివారం జగన్నాథ ఎక్స్‌ప్రెస్ ఓల్వో బస్సు సర్వీసును ప్రారంభించింది. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు చందాహండిలో బయలు దేరి మరుసటి రోజు ఉదయం 6 గంటకు బ్రహ్మపుర చేరుకుంటుంది. అదే విధంగా బ్రహ్మపురలో సాయంత్రం 6 గంటలకు బయలుదేరి ఉదయం 6 గంటలకు చందాహండి చేరుకుంటుంది. చందాహండి, నబరంగ్‌పూర్, జయపూర్, రాయగడ, దిగపొండిల మీదుగా బ్రహ్మపురకు రాకపోకలు సాగిస్తుంటుంది. బ్రహ్మపురలోని ఎంకేసీజీ ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రికి వెళ్లే రోగులకు ఈ బస్సు సర్వీసు ఉపయుక్తంగా ఉంటుంది. ఇందులో మహిళలకు సగం ధరకె టికెట్లు ఇవ్వనున్నారు.

పింగిపుట్‌లో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

రాయగడ: సదరు సమితి పరిధిలోని తడమ పంచాయతీ సింగిపుట్ గ్రామంలో సత్యసాయి మొబైల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఉత్కల్ కుమార్ రథ్, డాక్టర్ జి.వి.రమణ, డాక్టర్ సుకుమార్ త్రిపాఠి, ఫార్మసిస్ట్ ప్రమోద్ కుమార్ సాహు తదితరులు హాజరై 101 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి 12 మందికి కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని పితామహల్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు రిఫర్ చేసినట్లు డాక్టర్ ఎల్ఎన్ సాహు తెలిపారు. వైద్యపరీక్షల్లో భాగంగా ఇద్దరి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య



చెట్టుకు వేలాడుతున్న యువకుడి మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బోధపోదర్ పంచాయతీ బారడబందో గ్రామంలోని అడవిలో ఓ యువకుడి మృతదేహం చెట్టుకు వేలాడుతూ కనిపించింది. గ్రామస్తులు కొందరు కట్టెల కోసం అడవికి వెళ్లగా అడవి సమీపంలో చిన్న వంతెన వద్ద ఓ బ్యాగు, చెప్పులు కనిపించాయి. అటుగా వెళ్లగా ఓ యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో వారు సర్పంచ్ స్వప్నఖిలోకు విషయం తెలియజేశారు. ఆమె చిత్రకొండ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఐఐసీ ముకుందో మేల్కా తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని దింపి బ్యాగ్ తనిఖీ చేయగా అందులో ఆధార్ కార్డులో వివరాలు కనిపించాయి. యువకుడు మేరు రమేశ్ చంద్ర ఆలాంగ్ అని ఉంది. అతడిని బలిమెల సమీపంలోని సోమనాథ్‌పురం పంచాయతీ అలాంగుడ గ్రామానికి చెందిన వాడిగా గుర్తించారు. దీంతో అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. తన కుమారుడు ఆత్మహత్య చేసుకోలేదని, స్నేహితులతో కలిసి ఈ ప్రాంతానికి వచ్చాడని మృతుడి తండ్రి శుకదేవ్ ఆరోపించారు.

దేవమాలి పర్వత పరిరక్షణ


- పర్వతంపై రాత్రి బస నిషేధం
- ప్లాస్టిక్ తీసుకురావద్దని సూచన




సూర్యోదయ సూర్యాస్తమయ సమయాల్లో దేవమాలి



దేవమాలిపై మొక్క నాటుతున్న రాజమౌళి (ఫైల్)



దేవమాలి పై ప్రకృతి సౌందర్యం



దేవమాలి పై సుందర దృశ్యం

కొరాపుట్: ప్రపంచ పర్యాటక రంగంలో పేరు తెచ్చుకుంటున్న దేవమాలి పర్వత పరిరక్షణకు ప్రభుత్వం కఠిన ఆంక్షలు పెడుతోంది. ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తన నూతన చిత్రానికి సంబంధించి ఇక్కడ షూటింగ్ చేయడంతో ఈ ప్రాంతం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఆయన షూటింగ్ ముగించుకుని వెళ్లిపోతూ ఈ పర్వతంపై పర్యాటకులు చెత్త వదిలి వెళ్లడంపై ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి దీనిపై అనేక విజ్ఞప్తులు వచ్చాయి. అప్పటి నుంచి ప్రభుత్వం ఈ పర్వత పరిరక్షణ పై తీవ్రంగా దృష్టి సారించింది.

రాత్రిపూట రాకపోకలు నిషేధం

దేవమాలి పర్వతం మీద సూర్యోదయం, సూర్యాస్తమయం చూడడానికి పర్యాటకులు ఎక్కువ ఆసక్తి చూపుతారు. అందుకే గుడారాలు వేసి రాత్రి బస చేస్తుంటారు. దీంతో రాత్రి ఇక్కడ పర్యవేక్షణ ఉండేది కాదు. ఈ క్యాంప్ ఫైర్‌ల వల్ల ఔషధ మొక్కలు కాలిపోయేవి. విందు వినోదాల కారణంగా చెత్త పేరుకుపోయేది. అందుకే రాత్రి 8 నుంచి ఉదయం 5 వరకు దేవమాలిపై పర్యాటకులు ఉండకూడదని నిషేధం విధించారు. 2023 నాటి భారతీయ నాగరిక సురక్ష సంహిత 163 ప్రకారం,1986 నాటి పర్యావరణ పరిరక్షణ చట్టం 15 ప్రకారం ఈ ఆదేశాలు జారీ చేశారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

వ్యర్థాలపై కఠిన చర్యలు

దేవమాలిపైకి వచ్చే పర్యాటకులు తాము తెచ్చే వ్యర్థాలు తామే తిరిగి తీసుకొని వెళ్లేటట్లు సంచులు తెచ్చుకోవాలని రాజమౌళి సూచించారు. దాన్నే ప్రభుత్వం కఠిన నిబంధనగా మార్చింది. ఇకపై పర్యాటకులు అక్కడ వ్యర్థాలు వదల రాదని, తిరిగి తీసుకొని వెళ్లడానికి సంచులు తీసుకోవాలని ప్రభుత్వం హెచ్చరించింది. అంతేకాక సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు పైకి తీసుకురావద్దని హెచ్చరించింది.

అధికారుల పర్యటనలు

కొరాపుట్ కలెక్టర్ వీ.కీర్తి వాసన్ ఆదివారం దేవమాలి పర్వతంపై ఉన్నత స్థాయి అధికారులతో పర్యటించారు. రక్షణ చర్యల పై ఎస్పీ రోహిత్ వర్మ కూడా వెళ్లారు. ఇదే సమయంలో సీఎల్పీ నాయకుడు రామచంద్ర ఖడం కూడా అదే సమయంలో తన నియోజకవర్గ పర్యటనలో భాగంగా అక్కడకే వెళ్లారు. వీరంతా అనుకోకుండా కలుసుకోవడంతో అక్కడే సమావేశమయ్యారు. దేవమాలి పై భారీ ఎత్తున పర్యాటక సదుపాయాలు కల్పించడానికి కలెక్టర్ సమీక్ష చేశారు.



దేవమాలిపై సీఎల్పీ నాయకుడు రాం చంద్ర ఖడంతో కలెక్టర్ కీర్తి వాసన్, ఎస్పీ రోహిత్ వర్మ



దేవమాలి పై పర్యటిస్తున్న కలెక్టర్ వీ.కీర్తి వాసన్ బృందం

సంప్రదాయ వంటల ప్రదర్శన



వంటకాలను పరిశీలిస్తున్న మహేష్, శుభ్ర, మినియాక



బహుమతులు అందజేస్తున్న దృశ్యం



రాగి లడ్డూలు, నువ్వుల లడ్డు

రాయగడ: రాష్ట్రావతరణ పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో స్థానిక సంస్కృతి భవన ప్రాంగణంలో ఆదివారం ఒడిశా సంప్రదాయ వంటల ప్రదర్శన కార్యక్రమం జరిగింది. ఈ ప్రదర్శనలో జిల్లాలోని 12 స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు. రాయగడ మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శుభ్రాపండ, కౌన్సిలర్ మంజులా మినియాకలు అతిథులుగా వచ్చి వంటల ప్రదర్శనను తిలకించారు.

అదిరిన రుచులు

పర్లాకిమిడి: ఒడియా పక్షోత్సవాల్లో భాగంగా పర్లాకిమిడి డీఆర్‌డీఏ పంచాయతీ రిసోర్సు భవనంలో ఆదివారం ఉదయం ఒడియా పిండివంటల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 13 మందికి పైగా స్వయం సహాయక మహిళా గ్రూపులు పాల్గొని రాగి సున్నుండలు, కేకులు, పాయసం, కక్కరాలు, గారెలు తదితర వంటకాలు ప్రదర్శించారు. పోటీల్లో ప్రథమ బహుమతి రిమా సహా గెలుపొందగా, ద్వితీయ, తృతీయ బహుమతులు సునితా ప్రధాన్, రీనా మహారాణాలు గెలుపొందారు.



పిండివంటలు రుచిచూస్తున్న అధికారులు

వెళ్లకండి మాస్టారూ..



నబరంగ్‌పూర్ జిల్లాలో హెచ్‌ఎం రంజన్ బెహరాకు వీడ్కోలు చెబుతూ రోదిస్తున్న విద్యార్థులు

కొరాపుట్: బదిలీపై వెళ్లిపోతున్న హెచ్‌ఎంను వెళ్లనివ్వకుండా విద్యార్థుల కన్నీళ్లతో అడ్డుకున్నారు. ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా కొసాగుమడ సమితి బడఅమడ పంచాయతీకేంద్రంలో అక్కడి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంజన్ కుమార్ బెహరాకు బదిలీ సందర్భంగా వీడ్కోలు కార్యక్రమం జరిగింది. రంజన్‌కుమార్ ఇక్కడి వారికి బాగా దగ్గరైపోయారు. చక్కగా చదువు చెబుతుండడంతో గ్రామస్తులు కూడా టీచర్‌ను ఇష్టపడేవారు. పాఠశాల ప్రాంగణం అంతా కూరగాయల మొక్కలు పెంచి వాటిని విద్యార్థులకు వితరణగా ఇచ్చేవారు. వ్యవసాయంపై అవగాహన కల్పించేవారు. సొంత ఖర్చుతో పిల్లలకు భోజనాలు కూడా పెట్టేవారు. పాఠశాలకు రాని పిల్లల ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించేవారు. గత ఏడాది ఈ బడికి ఉత్తమ పాఠశాల అవార్డు కూడా వచ్చింది. అలాంటి టీచర్‌కు బదిలీ కావడంతో విద్యార్థులతో పాటు స్థానికులు కూడా కంటతడి పెట్టారు.

ముగిసిన మజ్జిగౌరమ్మ చైత్రోత్సవాలు



మజ్జిగౌరి అమ్మవారు



చండీ హోమం

రాయగడ: ఐదు రోజులుగా కొనసాగుతున్న మజ్జిగౌరి అమ్మవారి వార్షిక చైత్రోత్సవాలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టాలైన పూజారి నిప్పులపై నడక, ముళ్ల కంపలపై కూర్చుని ఊయలూగడం వంటి కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా శనివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమాలను వీక్షించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా ఆలయ ప్రధాన పూజారి చంద్రశేఖర్ బెరుకొ మందిర ప్రాంగణంలో ఖాళీ స్థలంలో అగ్నిగుండాన్ని వెలిగించారు. అనంతరం అమ్మవారి ప్రతిరూపాలైన ఘటాలను మోసుకొచ్చారు. నిత్యం అమ్మవారి సన్నిధిలో పూజలందుకునే కత్తి (ఖడ్గం)ని పూజారి చేతపట్టుకుని మండుతున్న నిప్పులపై నడిచారు. అనంతరం చండీ హోమంతో పూర్ణాహుతి కార్యక్రమాలు ముగిశాయి. ఆదివారం ఉదయం అమ్మవారి సన్నిధిలో ఉంచిన పాదాలను యథాస్థానానికి (పాదాల గుడి) తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు.



నిప్పులపై నడుస్తున్న పూజారి

భారీగా గంజాయి పట్టివేత



కలిమెల పోలీసులు పట్టుకున్న గంజాయితో నిందితులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రక్



చిత్రకొండ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల, చిత్రకొండ పోలీసులు వేర్వేరు ప్రాంతాల్లో 860 కిలోల గంజాయిను పట్టుకున్నారు. కలిమెల సమితి నుంచి అక్రమంగా చిత్రకొండ వైపునకు ట్రక్‌లో తరలిస్తున్న 500 కిలోల గంజాయిని కలిమెల పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. కలిమెల చెక్‌పోస్టు వద్ద పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఓ ట్రక్ అతివేగంగా రావడంతో దాన్ని ఆపి తనిఖీ చేశారు. గంజాయి కనిపించడంతో బండిలో ఉన్న హరియాణాకు చెందిన రాజ్‌కుమార్(26), సోను సింగ్ (23)లను అరెస్టు చేశారు. కలిమెల ఐఐసీ చంద్రకాంత్ తండ కేసు నమోదు చేశారు. నిందితులను మంగళవారం కోర్టులో ప్రవేశపెడతామని తెలిపారు. దొరికిన గంజాయి విలువ రూ.50 లక్షలు ఉంటుందని తెలిపారు. అలాగే చిత్రకొండ సమితి మంత్రీ పుట్ గ్రామం రహదారిలో ఆదివారం ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అడవిలో కొన్ని బస్తాలు కనిపించాయి. తీసి చూస్తే గంజాయి ఉంది. 360 కిలోల బరువు ఉన్న ఈ గంజాయి విలువ రూ.36 లక్షల వరకు ఉంటుందని చిత్రకొండ ఐఐసీ ముకుందో మేళ్క తెలిపారు.



చిత్రకొండ అడవి వద్ద గంజాయిను తూకం వేస్తున్న పోలీసులు

ఘనంగా స్వర్ణక్షేత్ర ఉత్సవం



వేదికపై సాహితీవేత్తలు

కొరాపుట్: ఉత్కళ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో స్వర్ణక్షేత్ర ఉత్సవం ఘనంగా జరిగింది. ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా కొసాగుమ్డ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఒడియా సాహిత్యంపై పద్య పోటీలు నిర్వహించారు. ఉత్కళ కవితా రంగంపై అద్భుత ప్రభావం చూపుతున్న తులసి మ్యాగజైన్‌ను ఆవిష్కరించారు. అనంతరం మా భాష మాది అనే అంశంపై చర్చగోష్టి జరిగింది. ఈ సందర్భంగా జరిగిన భాషా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ భాషా కవులు కైలాష్ చంద్ర నాయక్, ప్రఫుల్ల కుమార్ రౌత్, పవిత్ర కుమార్ హల్దార్, రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తిరుపతి బాలాజీ బెహరా తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న తిరుపతి బాలాజీ

క్లుప్తంగా

9 మందికి రిమాండ్

సోంపేట: సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నవోదయం 2.0 లో భాగంగా ఏప్రిల్ 1 నుంచి 12వ తేదీ వరకు 5 నాటు సారా కేసులు నమోదు చేసి 9 మందిని రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ బేబి తెలిపారు. పై కేసుల్లో 68 లీటర్ల నాటు సారా సీజ్ చేసి, 1800 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో పలువురు సిబ్బంది పాల్గొన్నట్లు తెలియజేశారు.

ఏరియా ఆస్పత్రికి కొత్త ఎక్స్‌రే మిషన్


ఎక్స్‌రే యూనిట్

నరసన్నపేట: స్థానిక ఏరియా ఆస్పత్రికి కొత్త ఎక్స్‌రే యూనిట్ అందుబాటులోకి వచ్చింది. ఇప్పటి వరకూ పాత ఎక్స్‌రే యూనిట్ నే వినియోగిస్తూ వచ్చారు. రూ. 7 లక్షల విలువ కలిగిన ఎక్స్‌రే యూనిట్ ఆస్పత్రికి మంజూరు కావడం యూనిట్ రావడంతో దాన్ని వెంటనే వినియోగం లోనికి తీసుకువచ్చారు. ప్రస్తుతం అన్ని రకాల ఎక్స్‌రేలు ఈ కొత్త మిషన్‌లో తీయవచ్చని యూనిట్ ఇన్‌చార్జి కృష్ణమూర్తి తెలిపారు. రోగులు వినియోగించుకోవాలని కోరారు.

ప్రజల కష్టాలపై కవులు స్పందించాలి


ప్రసంగిస్తున్న అంబేద్కర్ యూనివర్సిటీ సహాయ ప్రొఫెసర్ ఉదయ్‌కిరణ్

శ్రీకాకుళం కల్చరల్: దేశంలో అరాచక ఫాసిస్టు మూకలు రాజ్యాంగాన్ని విధ్వంసం చేస్తూ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నాయని, ఈ దశలో అంబేద్కర్ ఆశయాలను తలకెత్తుకుని ప్రజానీకం అంతా ఐక్యంగా ముందుకు సాగాలని కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. ఆదివారం ఇలిసిపురంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో సాహితీ స్రవంతి శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో సమతా భారత్ కవితా గోష్ఠిలో ఆయన మాట్లాడారు. ప్రజల కష్టాలపై కవులు స్పందించాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ విశ్వవిద్యాలయం సహాయ ఆచార్యులు డాక్టర్ కె.ఉదయ్‌కిరణ్ త్రిభాషా సూత్రం మాతృభాష అనే అంశంపై ప్రసంగించారు. 2020 నూతన విద్యావిధానం ద్వారా హిందీబాషను రుద్దాలని చూస్తున్నారని, మాతృభాషలో విద్యాబోధన విద్యార్థి ప్రాథమిక హక్కు అని అన్నారు. ఇతర భాషలు నేర్చుకోవడం ఐచ్ఛికమన్నారు. సభకు అధ్యక్షత వహించిన సాహితీ స్రవంతి కన్వీనర్ కేతవరపు శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు, స్వాతంత్రోద్యమ లక్ష్యాలు నీరు గారకుండా గళం ఎత్తి కలాలకు పదును పెట్టాలని పిలుపునిచ్చారు.

'సిలబస్ భారం తగ్గాల్సిందే'

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాల విద్య, ఉన్నత తరగతుల్లో సాంఘిక శాస్త్ర సిలబస్ భారం తగ్గించాలని లేకుంటే విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి పాఠశాలకు రెండేసి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల పోస్టులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరమ్ జిల్లా శాఖ ప్రతినిధులు మక్కా శ్రీనివాసరావు, బాడాన రాజు, ఎల్.గుణశేఖర్, సీ.హెచ్.సుబ్బలక్ష్మి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫోరం జిల్లా ప్రతినిధులు మాట్లాడుతూ 8, 9, 10 తరగతుల్లో సాంఘిక శాస్త్రంలో సిలబస్ భారం, విషయ భారం అధికంగా ఉండడం విద్యార్థులకు పెను భారంగా ఉందని అన్నారు. ఒక సగటు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు పదిహేను పాఠ్యపుస్తకాలు బోధించాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల మానసిక స్థాయిని దృష్టిలో పెట్టుకొని సాంఘిక శాస్త్ర పాఠ్య పుస్తకాలను పునఃపరిశీలించి అసంబద్ధ విషయాంశాలు తొలగించి సిలబస్ భారం లేకుండా కుదించాలని విన్నవించారు. ఆ అవకాశం లేనిపక్షంలో భూగోళ, అర్థశాస్త్రాల బోధనకు ఒక ఉపాధ్యాయుడు, చరిత్ర, పౌరశాస్త్రాల బోధనకు మరొక ఉపాధ్యాయుడు చొప్పున ప్రతి పాఠశాలకు రెండేసి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ పోస్టులు కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నరసన్నపేట: జాతీయ రహదారిపై తామరాపల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలాకి మండలం పాత జడూరుకు చెందిన డి.హేమలరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన ద్విచక్ర వాహనంపై నరసన్నపేట వైపు నుంచి స్వగ్రామం పాత జడూరుకు వెళ్తుండగా ఎదురుగా మరో వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ముందుగా వెళ్తున్న లారీ కట్లు ఊడి పోతుండటంతో ప్రమాదం జరుగుతుందని గమనించి లారీ డ్రైవర్‌కు చెప్పడానికి ఓవర్ టేక్ చేస్తున్నప్పుడు ఎదురుగా వచ్చిన వాహనం ఢీ కొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడిన వ్యక్తిని 108 లో ఆస్పత్రికి తరలించారు.

వైభవంగా భక్తిసంగీత విభావరి


జగన్నాథ భక్తి పాటలను ఆలపిస్తున్న శుభజ్యోతి


వేదికపై ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, ఎస్పీ జి.ఎన్.పండా, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెట్టి, ప్రదీప్ నాయక్

పర్లాకిమిడి: స్థానిక రాజవీధి అర్బన్ బ్యాంకు గ్రౌండ్స్‌లో శనివారం రాత్రి భక్తి సంగీత సంసద్ ఆధ్వర్యంలో 45వ భజన సమారోహన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, ఎస్పీ జితేంద్రనాథ్ పండా, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, మహాంత రామానంద దాస్‌జీ, ఉపాధ్యక్షులు ప్రదీప్ నాయక్, భరత్ భూషణ్ మహంతిలు అతిథులుగా విచ్చేశారు. ఒడియా సినీ సంగీత దర్శకులు ప్రశాంత్ పాఢి, గాయకులు శుభజ్యోతి, ప్రభుప్రశాంత్ మహంతి, స్వస్థిక్ పాఢి తదితరులు జగన్నాథ భక్తి సంగీత గేయాలను శ్రావ్యంగా ఆలపించి శ్రోతలను అలరించారు. హార్మోనిస్టు కైలాస్ చంద్ర పట్నాయిక్, ఉపాధ్యాయులు మనోజ్ పట్నాయిక్, ప్రసన్న కుమార్ రథ్, తిరుపతి పండా, అర్చనా రోథో తదితరులకు ఎమ్మెల్యే చేతులమీదుగా అవార్డులు అందజేశారు. గౌరీ ప్రసాద్ రథ్, ఎస్.ఎన్.రథ్ తదితరులు పర్యవేక్షించారు.


హార్మోనిస్టు కైలాస్ పట్నాయిక్‌కు అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే


పర్యావరణ పరిరక్షకులు తిరుపతి పండాకు అవార్డు ప్రదానం


భక్తి సంగీత కార్యక్రమానికి విచ్చేసిన అభిమానులు

ఫుట్‌బాల్ చాంపియన్‌గా జీబా టైగర్స్


ఫైనల్స్‌కు చేరిన జీబా టైగర్స్, నువాగడ ఫైటర్స్ జట్లు


రన్నర్స్ ట్రోఫీతో నువాగడ ఫైటర్స్ జట్టు


విన్నర్ ట్రోఫీతో జీబా టైగర్స్ జట్టు


సీఎం చాంపియన్‌షిప్ ఫుట్‌బాల్ ఫైనల్స్ చేరిన జట్లకు అభినందనలు తెలుపుతున్న డీఈఓ మాయాధర్ సాహు

పర్లాకిమిడి: స్థానిక గజపతి స్టేడియంలో ఏప్రిల్ 7వ తేదీ నుంచి జరుగుతున్న జిల్లా స్థాయి సీఎం ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఫైనల్స్‌లో నువాగడ, జీబా టైగర్స్ మధ్య పోటీ జరిగింది. నువాగడ ఫైటర్స్‌పై నాలుగు పాయింట్ల తేడాతో జీబా టైగర్స్ విజేతగా నిలిచింది. జీబా టైగర్స్‌కు భువనేశ్వర్‌లో రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ అకాడమీలో చేర్చి ఫుట్‌బాల్‌లో కోచింగ్ ఇస్తూ ఉన్నత చదువులు చదివిస్తుంది. జీబా టైగర్స్‌లో అందరూ 15 ఏళ్ల వయస్సు గలవారే. జిల్లాలో 8 క్లబ్‌లకు చెందిన క్రీడాకారులు అండర్ 15 గ్రూప్‌లో 176 మంది ఏప్రిల్ 7 నుంచి 13వ తేదీ వరకు ఆడారు. ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, జిల్లా ఎస్పీ జితేంద్ర నాథ్ పండా, గౌరవ అతిథి డీఈఓ మాయాధర్ సాహు, విద్యాలయాల పీఈటీ సురేంద్ర పాత్రో హాజరయ్యారు. ట్రోఫీని జీబా టైగర్స్ జట్టుకు ఎమ్మెల్యే అందజేయగా, నువాగడ ఫైటర్స్ జట్టుకు రన్నర్స్ ట్రోఫీని జిల్లా ఎస్పీ అందజేశారు. ఈ విద్యాలయాల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలలో విద్యాలయాల క్రీడా శిక్షకులు ధర్మేంద్ర సామల్, సంతోష్ పట్నాయక్, ప్రియదర్శి మిశ్రా, రేఖారాణి దేవ్, శివరాం భుయ్యాన్, కె.వి. రెడ్డి, కిశోర్ సామల్ పర్యవేక్షించారు.

పాడేరు ఘాట్‌లో వాహనం బోల్తా

- 15 మందికి గాయాలు
- 'ఫైర్' అధికారుల తక్షణ స్పందనతో తప్పిన ప్రాణాపాయం


ప్రమాదానికి కారణమైన వాహనం


మాడుగుల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు


క్షతగాత్రులను ఫైర్ వాహనంలోకి ఎక్కిస్తున్న సిబ్బంది

మాడుగుల: పాడేరు రోడ్డులో ఏసు ప్రభువు విగ్రహం టర్నింగ్ పాయింట్ వద్ద శనివారం రాత్రి 3 గంటల సమయంలో బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 15 మందికి గాయాలయ్యాయి. అయితే ఫైర్ అధికారులు వెంటనే స్పందించి బోల్తా పడిన వాహనాన్ని తప్పించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించడంతో ప్రాణ నష్టం జరగలేదు. స్థానిక ఫైర్ స్టేషన్ అధికారి రాజేశ్వరరావు కథనం ప్రకారం.. వీరంతా ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా కొడవలస, సీతమామిడి గ్రామాల నుంచి తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట వలస వెళ్తున్నారు. దీంతో వాహనం అదుపు తప్పడంతో వీరికి గాయాలయ్యాయి. ఈ సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడ నుంచి క్షతగాత్రులను తమ వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించి తీవ్రంగా గాయాలైన ఏడుగురిని మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.

కొరాపుట్ జిల్లా మహిళా క్రికెట్ టీమ్ ఎంపిక


జిల్లా మహిళా క్రికెట్ టీమ్‌కు ఎంపికైన క్రీడాకారులు

జయపురం: కొరాపుట్ జిల్లా మహిళా క్రికెట్ టీమ్‌ను ఆదివారం ఎంపిక చేశారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన మహిళా క్రికెట్ క్రీడాకారులకు నిర్వహించిన పోటీలో 17 మందిని ఎంపిక చేశారు. ప్రియాంక వర్మ (కెప్టెన్), సామరి హోంజరియ, నమ్రత్ ఎడ్డింగ్, సాలు బరోల్, సునీత ఖిలో, జానకి చలాన్, సుంబాల పర్విన్, డోళీ అంపాడియ, అమ్రిత ద్యుయెల్ పాడియ, గంగా హంజారియ, సుదురుతి రౌత్, దిబ్యశ్రీ జెన, భవాన బర్మ, ప్రియాంక పాత్రో, జశ్విని మహంతిని ఎంపిక చేశామని జయపురం సబ్‌డివిజనల్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి రబి నాయక్ వెల్లడించారు. గౌరీ ప్రధాని, గీతాంజలి రిషిలను స్టాండ్ బై ఆటగాళ్లగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. మహిళా క్రీడాకారుల మధ్య నిర్వహించిన పోటీలను రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అనూప్ కుమార్ పాత్రో, జి.ప్రసాద్, జి.సత్యనారాయణ నిర్వహించి, ఉత్తమ మహిళా క్రీడాకారులను ఎంపిక చేశారని వెల్లడించారు.

ఆదిత్యుని సన్నిధిలో భక్తజనం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. ఇతర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కళకళలాడాయి. ఎండ తీవ్రత అధికంగా ఉన్న తరుణంలో ఆలయం తరఫున మంచినీటిని పంపిణీ చేసినప్పటికీ..భక్తుల దాహం తీర్చలేకపోయారనే విమర్శలు వినిపించా యి. పలువురు వీఐపీలు ఆదిత్యుని దర్శనానికి రావడంతో గౌరవ స్వాగతాలు, ప్రత్యేక దర్శనాల ఏర్పా ట్లు చేశారు. దేవదాయశాఖ మాజీ కార్యదర్శి సుందరకుమార్ కుటుంబసమేతంగా ఆదిత్యుడిని దర్శించుకున్నారు. అలాగే విశాఖపట్నం జిల్లా వాస్తవ్యులు రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ చాగంటి సన్యాసిరాజు నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆలయ సీనియర్ అసిస్టెంట్ శోభనాద్రాచార్యులుకు విరాళ నగదును అందజేయగా అందు కు తగిన రశీదును ఆయన దాతలకు అందజేశారు.

గిరిజనుల ఆందోళన


అడవిలో సమావేశమైన గిరిజనులు


ధర్నా చేస్తున్న గిరిజనులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి కొత్తమాట్టేరు గ్రామానికి చెందిన గిరిజనులు ఆదివారం తమ ప్రాంతంలో దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీ కడతామని చేసిన ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టారు. గత 40 సంవత్సరాలుగా ఈ ప్రాంతాంలో అడవి సంపదతో జీవనం సాగిస్తున్నామన్నారు. ఇప్పుడు అడవిని నాసనం చేసి తమకు రోడ్డున పడేస్తారా అని ఆవేదన చెందారు. 2006లో అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులుకు ఈ భూములు ఇవ్వాలని, కానీ ఇంతవరకు ఇవ్వలేదన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న రెండు అడవులను ఒకటి దాల్మియా సిమెంట్ కంపెనీకి, రెండోది ఆదానీ కంపెనీకి మొత్తం 4000 ఎకరాలు లీజ్‌కు ఇచ్చారు. ఇక్కడ నివసించే వందలాది గ్రామాలకు జీవనోపాధి నుంచి దూరం చేస్తుందన్నారు. సున్నం రాయి పేలుళ్ల వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ఆదివాసీ ఉద్యమ నాయకుడు ప్రఫుల్ల సామంత్రాయి, తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువుల పొట్టలపై వాతలు పెట్టొద్దు


ప్రసంగిస్తున్న మున్నా ఖాన్


హాజరైన గిరిజన మహిళలు

కొరాపుట్: నవజాత శిశువుల పొట్టలపై వాతలు పెట్టవద్దని బీజేడీ ఎంపీ, ఒడియా సినీ హీరో ముజిబుల్లా ఖాన్ (మున్నా) ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ సమితి సెమిఖొడ్ర పంచాయతీ ఖండ గ్రామంలో జన జాగృతి మిషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో గిరిజన మహిళలనుద్దేశించి ప్రసంగించారు. అప్పుడే పుట్టిన శిశువుల పొట్టలపై కొడవలిని కాల్చి వాతలు పెట్టడంతో అనాగరికమన్నారు. నబరంగ్‌పూర్ జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాల్లో ఇంకా ఇటువంటి మూఢనమ్మకాలు కొనసాగుతుండటం బాధాకరమన్నారు. ఇటువంటి వాతలు పెట్టే మంత్రగత్తెలను పోలీసులు అరెస్ట్ చేయాలన్నారు. కార్యక్రమంలో సయాద్ కాజిం మదాని తదితరులు పాల్గొన్నారు.

అదరగొట్టిన కళాకారులు


ప్రశంసా పత్రాలు, బహుమతులు అందుకున్న జయపురం నాటక కళాకారులు


జీవనం ఒక నాటకంలో ఒక సన్నివేశ


పెట్టపై నాటకంలో ఒక సన్నివేశం

జయపురం: కొరాపుట్‌లో దక్షిణ ఒడిశా నాటక సంఘం, దక్షిణ ఒడిశా నటక సంఘంలు సంయుక్తంగా నిర్వహించిన నాటక మహోత్సవంలో జయపురం కళాకారులు ప్రదర్శించిన రెండు నాటకాలు నిర్వాహకుల, ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. జయపురం కళాకారులు ప్రదర్శించిన 'పెట్టపై నాటకొ'(పొట్ట కొరకు నాటకం), 'జీవనపై నాటకొ'(జీవితమే ఒక నాటకం)అనే రెండు నాటకాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. నిరంజన్ పటాన్నాయిక్ రచించిన 'పెట్ట పై నాటకొ'కి ఆయనే దర్శకత్వం వహించారు. నటీ నటులుగా కమలా కాంత రథ్, సురేష్ హొత్త, నరశింగ షాడంగి, పవిత్ర మల్లిక్, నివేదన పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు. వారి అద్భుత నటనకు ప్రేక్షకులు మంత్ర ముగ్ధులయ్యారు. ఈ నాటకానికి ప్రముఖ కళాకారుడు, న్యాయవాది జి. మహేష్, రమనిగమ్ హమంతి సంగీతం సమకూర్చారు.

జయపురం సాంస్కృతిక పరిషత్ వారు ప్రదర్శించిన మరో నాటకం 'జీవనం ఒక నాటకం' జగదీష్ అధికారి రచించగా.. నాటకానికి దర్శకత్వం వహించారు నిరంజన్ పాణిగ్రాహి. ఈ నాటకంలో పాత్రధారులు పంచానన మిశ్ర, జుగల్ సాహు, విష్ణు ఆచార్య, పవిత్ర మల్లిక్, అశోక్ మహారాణ, నిరంజన్ పాణిగ్రాహి, శ్రీమతి విజయ లక్ష్మి పాణిగ్రాహి, పమర్పిత పాణిగ్రాహి, బాల నటుడు నివేదన పాణిగ్రాహి అద్భుతంగా నటించారు. ఈ నాటకానికి జి. మహేష్, రామనిగమ్ మహంతి, మున మహంతిలు సంగీతం సమకూర్చారు. ప్రతికూల పరిస్థితిలో ఒక నాటక రచయిత రచించిన నాటక జీవితంలో ఎటువంటి అనుభవాలు చవి చూశాడో ప్రేక్షకులకు అందించాడు రచయిత.

వడగళ్ల వాన


బొయిపరిగుడలో దట్టంగా పడిన వడగళ్లు


ఈదురుగాలులకు విరిగిన చెట్టు

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడలో శనివారం సాయంత్రం వడగళ్ల వర్షం పడింది. సమితిలోని అనేక ప్రాంతాలలో పెనుగాలులతో భారీ వర్షం కుసింది. గత 25 ఏళ్ల కాలంలో ఇంత పెద్ద ఎత్తున వడగళ్ల వర్షం పడలేదని ప్రజలు చెబుతున్నారు. భలంగా గాలులు వీచటంతో పలుచోట్ల చెట్లు నేల కూలాయి. పలుచోట్ల ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. పెనుగాలులు, వడగళ్లు పడటంతో మామిడి, జీడిమామిడి పంటలకు భారీ నష్టం వాటిల్లందని రైతులు తెలిపారు. సమితిలో మయినపడ, హలదిమఝిగుడ, పలిగుడ, భొరాగుడ, ముండగుడ, చికిమ, బొయిపరిగుడ, బొదాపుట్ తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులు, వడగళ్ల వర్షం కారణంగా ఎంత నష్టం జరిగిందో తెలుసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు.

గనుల తవ్వకాలపై ఎంపీ ఆగ్రహం


పొట్టంగిలో కాంగ్రెస్ కార్యకర్తలతో ఎంపీ సప్తగి


మాట్లాడుతున్న కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత

కొరాపుట్: కొరాపుట్ జిల్లాలో కొడింగా మాలిలో గనుల తవ్వకాలపై కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితి కేంద్రంలోని ప్రభుత్వ గెస్ట్ హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. గ్రామ సభ, పల్లె సభ తీర్మానాలను ఉల్లంఘించి అక్రమాలు జరుగుతున్నాయన్నారు. గత తీర్మానాలను పక్కన పెట్టి తవ్వకాల పరిధిని పెంచారన్నారు. అందుకు కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో మోహన్ మజ్జి ప్రభుత్వాలు గనుల తవ్వాకాలకు రాజ మార్గాలు ఏర్పాటు చేస్తున్నాయన్నారు. గిరిజనులకు మిగిలేది కేవలం కాలుష్యమేనన్నారు. తాము అంబెడ్కర్ ఆశయాల సాధన కోసం రాహుల్ గాంధీ నేతృత్వంలో బలహీన వర్గాలకు అండగా నిలబడతామన్నారు. కొడింగా మాలిలో బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఎంపీ సప్తగిరి ఉల్క హెచ్చరించారు. ఈ సమావేశంలో లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత, ఎంపీ ప్రతినిధి మనోజ్ ఆచార్యలు పాల్గొన్నారు. అంతకు ముందు నియోజకవర్గ పర్యటనలో భాగంగా అంబెడ్కర్ సంఘాలతో సమావేశమయ్యారు.

అంబరాన్ని తాకిన తులసమ్మ సంబరం



ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా లొద్దపుట్టిలో పూజలందుకుంటున్న ధనరాజుల తులసమ్మ సంబర మహోత్సవం ఆదివారం అంబరాన్ని తాకింది. ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ ఎం.చిన్నంనాయుడు, రూరల్ ఎస్ఐ ఈ.శ్రీనివాస్‌లు పటిష్టమైన బందోబస్త్ ఏర్పాటు చేశారు.

– ఇచ్ఛాపురం రూరల్

క్లుప్తంగా

హెచ్‌సీ కృష్ణమూర్తికి సత్కారం



హెడ్‌కానిస్టేబుల్ కృష్ణమూర్తిని సత్కరిస్తున్న కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్, ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు

పార్వతీపురం రూరల్: పార్వతీపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కె.కృష్ణమూర్తి తనకు నెలకు వచ్చిన జీతంలో కొంతమొత్తాన్ని పేదప్రజలు, పేద విద్యార్థుల అవసరాలు తీర్చేందుకు ఉపయోగిస్తున్న విషయం, అలాగే మరికొన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ మేరకు ఆదివారం పట్టణ శివారులో ఉన్న సూర్యపీఠం దేవస్థానంలో సాహితీ లహరి, మంచుపల్లి సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ కృష్ణమూర్తి సేవలను కొనియాడుతూ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావుల చేతుల మీదుగా సాహితీ లహరి సేవాశ్రీ పురస్కారాన్ని కృష్ణమూర్తికి అందజేశారు. కార్యక్రమంలో డా.మంచుపల్లి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ పోలీస్‌శాఖలో పనిచేస్తూ తన కష్టార్జితంలో కొంతమొత్తాన్ని సామాజిక రంగంలో విస్తృతంగా సేవలు అందించేందుకు కేటాయిస్తున్న కృష్ణమూర్తి సేవలు పలువురికి ఆదర్శమని ప్రశంసించారు.

పశువులశాల దగ్ధం



కాలిపోతున్నా పశువుల శాల

దత్తిరాజేరు: మండలంలోని పిలింగాలవలసలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో పశువుల శాల, గడ్డివాములు దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. గండి సింహాచలానికి చెందిన పశువుల శాలకు నిప్పు అంటుకోవడంతో పక్కనే ఉన్న గండి కృష్ణ గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామస్తులు సమాచారం అందించడంతో బాడంగి ఫైర్ స్టేషన్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

బిల్లుమడ సమీపంలో ఏనుగులు

భామిని: మండలంలోని పాత బిల్లుమడ సమీపంలో ఆదివారం ఏనుగుల గుంపు హడావిడి చేసింది. గ్రామ సమీపంలోకి నాలుగు ఏనుగుల గుంపు ప్రవేశించడంతో చూసేందుకు పిల్లలు,పెద్దలు పోటీ పడ్డారు.వరుస సెలవులు కావడంతో పిల్లలతో పెద్దలు బిల్లుమడ గ్రామానికి వెళ్లి ఏనుగులను దగ్గరుండి చూశారు. సందర్శకులు పెరిగి కేకలు వేయడంతో తోటలోకి ఏనుగులు జారుకున్నాయి. ఏనుగుల సమీపంలో ఉండాల్సిన ట్రాకర్స్ వలన రైతు జీడి తోటకాపలాలోనే ఉంటున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

వంగర: ఇంటి పనుల్లో మహిళలకు పురుషులు సహకారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.కల్యాణి కోరారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని కోనంగిపాడు గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్ద పురుషులు అందించాల్సిన సహకారంపై ఆదివారం అవగాహన కల్పించారు. వారికి ప్రతిరోజూ పౌష్టికాహారం అందేలా చూడడంతో పాటు బరువులు ఎత్తే పనులు వారితో చేయించవద్దన్నారు. రెండేళ్ల వయసు వరకు చిన్నారులను బాగా చూసుకోవాలన్నారు. అనంతరం పౌష్టికాహారం ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్ రూపావతి, జి.రమణి, జి.పద్మ, ఎస్.లక్ష్మి, పి.కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతిపై కేసు నమోదు

కొత్తవలస: మండలంలోని విజయనగరం రోడ్డులో గల బలిఘట్టం గ్రామం జంక్షన్ సమీపంలో శనివారం లారీ ఢీకొని గొల్లలపాలెం గ్రామానికి చెందిన ఎస్.వినయ్‌కుమార్ మృతి చెందడంపై సీఐ ఎస్.షణ్ముఖరావు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన లారీని సీజ్ చేసినట్లు ఆదివారం ఆయన తెలిపారు.లారీ డ్రైవర్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని గాలింపు చేపట్టినట్లు చెప్పారు. కాగా మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో గురుకులాల ప్రభంజనం

- ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 6 గురుకులాల్లో శతశాతం ఉత్తీర్ణత

విజయనగరం అర్బన్: 'ఇది విజయనగరం జిల్లా వేపాడ మండల కేంద్రంలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల భవనం. ఇక్కడి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 75 మంది ఎంపీసీ, బైపీసీ కోర్సులలో పరీక్ష రాస్తే అందరూ ఉత్తీర్ణులై శతశాతం ఫలితాల గురుకులాల జాబితాలో చేరింది. అదే విధంగా ఇంటర్ రెండో సంవత్సరం ఎంపీసీ, బైపీసీ పరీక్షలు రాసిన 62 మంది విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ ఇంటర్ ఎంపీసీలో 454/470 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో అధిక మార్కుల తెచ్చుకున్న వారితో ఈ కళాశాల ముందువరుసలో ఉంది.



విజయనగరం జిల్లా వేపాడ మండలం కేంద్రంలోని గురుకుల విద్యాభవనం



పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం కేంద్రంలోని గురుకుల విద్యాభవనం

- పార్వతీపురం మన్యం జిల్లాలోని కొమరాడ మండల కేంద్రంలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం ఇది. ఇక్కడ ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ చదివిన 73 మంది విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ కోర్సుల విద్యార్థులు 61 మందికి అందరూ పాసై శతశాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. ద్వితీయ ఇంటర్‌లో 966/100 మార్కులు తెచ్చుకుని కె.గాయత్రి, పి.శాంతికుమారి జిల్లా స్థాయిలో ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. ప్రథమ ఇంటర్ బైపీసీలో 454/700 మార్కులతో పి.రేవతి జిల్లాలో ముందు వరసలో ఉంది.

మొదటి నాలుగు స్థానాల్లో గురుకులాల విద్యార్థినులు

ద్వితీయ ఇంటర్ ఎంపీసీ కోర్సుల ఫలితాల్లో జిల్లా స్థాయి మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థుల వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి గురుకుల పాఠశాల విద్యార్థిని పి.మేఘన 972/1000, కొమరాడ గురుకుల కళాశాల విద్యార్థిని కె.గాయత్రి 966/1000, పి.శాంతికుమారి 966/1000, వేపాడ గురుకుల విద్యార్థిని ఎం.కావ్య 961/1000 మార్కులతో మొదటి నాలుగు స్థానాలను వరుసగా సాధించారు. అదేవిధంగా బైపీసీలో కూడా మొదటి మూడు స్థానాలు గురుకులాల విద్యార్థినులే సాధించారు. చీపురుపల్లి గురుకుల విద్యార్థిని కె.కల్యాణి 975/1000, కొమరాడ గురుకుల విద్యార్థిని టి.లోహిత, డి.దుర్గ 974/1000, చీపురుపల్లి విద్యార్థిని కె.రమ్య 968/1000 మార్కులతో మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. సీఈసీ విభాగంలో నెల్లిమర్ల విద్యార్థినులు కె.శశికళ 959/1000, ఎం.హారిక 927/1000 మార్కులు తెచ్చుకుని వరుసగా మొదటి, రెండు స్థానాల్లో



పి.మేఘన (ఎంపీసీ 972/1000)



కె.కల్యాణి (బైపీసీ 975/1000)



పి.రేవతి (ప్రథమ ఎంపీసీ 463/700)



కె.హరిప్రియ (ప్రథమ బైపీసీ 432/440)

ఉన్నారు. హెచ్‌ఈసీ విభాగంలో భామిని విద్యార్థిని ఎ.రాజేశ్వరి 856/1000 మార్కులతో మొదటి స్థానంలో నిలిచింది. ప్రథమ ఇంటర్ ఎంపీసీ విభాగంలో కొమరాడ విద్యార్థిని పి.రేవతి 463/470, గరుగుబిల్లి విద్యార్థిని ఆర్.పూజిత 459/470, వేపాడ విద్యార్థిని సౌజన్య 454/470 మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ప్రథమ ఇంటర్ బైపీసీ విభాగంలో కొమరాడ గురుకుల పాఠశాల విద్యార్థిని వై.ప్రశాంతి 433/440, వంగర గురుకుల విద్యార్థినులు కె.హరిప్రియ 432/440, పి.మౌనిక 431/440 మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ఎంఈసీ గ్రూప్‌లో ఎస్.రేణుక 424/440, సీఈసీలో వై.దేవి 421/500, హెచ్‌ఈసీ గ్రూప్‌లో డి.సంజన 477/500 మార్కులతో ఆయా గ్రూప్‌లలో మొదటి స్థానంలో ఉన్నారు.

పెరిగిన ఉత్తీర్ణత శాతం

గత ఏడాది ఫలితాల్లో ప్రథమ ఇంటర్ 82.21 ఉత్తీర్ణత శాతం ఉంటే తాజాగా వచ్చిన ఫలితాల్లో 86.78 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అదేవిధంగా గత ఏడాది ద్వితీయ ఇంటర్‌లో 87.25 ఉత్తీర్ణత శాతం ఉంటే తాజాగా వచ్చిన ఫలితాల్లో 93.82 శాతం నమోదైంది.

సంస్కరణల ఫలితమే..

గత ప్రభుత్వం విద్యారంగంలో ఐదేళ్లుగా చేపట్టిన సంస్కరణలు ఉత్తమ ఫలితాలను ఇస్తున్నాయి. విద్యారంగంలోని అకడమిక్, సంక్షేమ, గురుకులాల నిర్వహణలో చారిత్రాత్మక నిర్ణయాల వల్ల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెరిగాయని తెలియజేయడానికి తాజాగా వచ్చిన ఇంటర్మీడియట్ ఉత్తమ ఫలితాలే కారణంగా నిలుస్తాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 13 డాక్టర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ప్రథమ ఇంటర్‌లో శతశాతం ఉత్తీర్ణత వచ్చిన నాలుగు కళాశాలల్లో విజయనగరం జిల్లాకు చెందిన వేపాడ, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన కొమరాడ, గరుగుబిల్లి, పార్వతీపురం గురుకులాలు ఉన్నాయి. అదే విధంగా ద్వితీయ ఇంటర్‌లో శతశాతం ఉత్తీర్ణత వచ్చిన 6 కళాశాలలో విజయనగరం జిల్లాకు చెందిన మూడింటిలో వంగర, బాడంగి, వేపాడ ఉండగా పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన మూడింటిలో కొమరాడ, గరుగుబిల్లి, పార్వతీపురం ఉన్నాయి.

మెరుగైన ప్రమాణాలతో సాధ్యమైన ఫలితాలు



గురుకులాల్లో అందిస్తున్న మెరుగైన విద్యా ప్రమాణాలతో కూడిన బోధన వల్ల మంచి ఫలితాలను సాధించాం. విద్యాలయాల్లోని బోధన సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో బోధన అందించారు. విద్యార్థులు కూడా క్రమశిక్షణతో అభ్యసించడం వల్ల అందరి కృషితో మంచి ఫలితాలను సాధించగలిగాం.

శంబాన రూపావతి, ఉమ్మడి విజయనగరం జిల్లా కోఆర్డినేటర్

ప్రజలపై గ్యాస్ మంట

- మహిళల నిరసన

విజయనగరం గంటస్తంభం: కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, ఇంటి పన్ను, కరెంట్ బిల్లుతో పాటు వంట గ్యాస్‌పై 50 రూపాయలు పెంచడాన్ని నిరసిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ విజయనగరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్ ఉన్న ఎన్టీఆర్ విగ్రహం దగ్గర గ్యాస్ బండలు మహిళలు నెత్తిన పెట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ..కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాల దెబ్బకు ప్రజల జీవన విధానం కుదేలైందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఉచిత గ్యాస్ అనే పేరుతో ఆర్భాట ప్రచారాలు నిర్వహించి ఎన్నికల్లో నెగ్గిన తర్వాత శ్రీరామనవమి సందర్భంగా వంట గ్యాస్‌పై 50 రూపాయలు పెంచి ప్రజలపై అధిక భారం మోపుతున్నారన్నారు. అధికారం చేపట్టిన పది నెలల కాలంలో విద్యుత్ చార్జీలు, మందుల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు, ఆస్తి పన్ను పెంపు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. గత ప్రభుత్వంలో ఆనాడు ప్రతిపక్షంగా ఉన్న చంద్రబాబు బాదుడే బాదుడు అంటూ అందోళనకు దిగారని విమర్శించారు. పట్టణాల్లో పెంచిన ఆస్తి పన్నులతో ప్రజలు సతమతం అవుతున్నారని, ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుతున్నా ఇక్కడ మాత్రం అధిక ధరలు పెంచడం సిగ్గుచేటు అని విమర్శించారు. వెంటనే ఎక్సైజ్ సుంకం రద్దు చేయాలని కోరారు. పెట్రోల్,డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించకపోతే ప్రజల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.రంగరాజు, మార్క్‌నగర్ శాఖ సహాయ కార్యదర్శి బూర వాసు, బల్లివీధి శాఖ సహాయ కార్యదర్శి పొందూరు అప్పలరాజు, శాంతినగర్ శాఖ నాయకురాలు సూరీడమ్మ, మహిళలు పాల్గొన్నారు.



గ్యాస్‌బండలు మహిళలు నెత్తిన పెట్టుకుని నిరసన తెలిపిన దృశ్యం

సత్తా చాటిన గిరిబాలలు



బాలికల జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులు

- ఇంటర్ ఫలితాల్లో అద్భుతం

సీతంపేట: కార్పొరేట్ తరహా కళాశాలను తలదన్నేలా కనిపిస్తున్న ఈ భవనం మల్లి గిరిజన గురుకుల ప్రతిభా కళాశాల. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో దీన్ని అభివృద్ధి చేసి విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. ఈ సంవత్సరం విద్యార్థులు 99 శాతం ఫలితాలు సాధించారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 71 మంది హాజరు కాగా 70 మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 67 మంది విద్యార్థులు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణత సాధించారు.

- సీతంపేట బాలికల గురుకుల కళాశాలలో 163 మంది ప్రథమ సంవత్సరం పరీక్షలకు హాజరు కాగా 160 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ కోర్సులో 19 మంది పరీక్షలకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణత చెందారు. ద్వితీయ సంవత్సరంలో 165 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందరూ పాసయ్యారు. వృత్తివిద్యాకోర్సులో 25 మందికి 25మంది పాసయ్యారు. సీతంపేటలోని బాలురు గురుకులంలో 165 మంది ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు హాజరు కాగా 159 మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 157 మందికి 153 పాసయ్యారు.

ఫలితం ఇచ్చిన మౌలిక సదుపాయాల కల్పన

విద్యార్థులకు గత ప్రభుత్వ హయాంలో సమకూర్చిన సౌకర్యాలు, స్టడీ మెటీరియల్, ప్రత్యేక తరగతులు, పూర్తిస్థాయిలో బోధన సిబ్బంది నియామకం వంటి చర్యలతో ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా మొదటిస్థానం సాధించిందని చెప్పవచ్చు. కేజీబీవీతో పాటు పలు కళాశాలల్లో నాడు-నేడు వంటి పనులు జరగడం విద్యార్థులకు చదువుకోవడానికి తగిన సదుపాయాలు, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అప్పటి ప్రభుత్వం కల్పించడంతో పాటు అమ్మఒడి పేరుతో ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు చెల్లించడం తదితర కారణాలతో గిరిజన విద్యార్థులు ఎక్కువగా ప్రభుత్వ కళాశాలల్లో చేరడానికి మొగ్గుచూపారు. ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలల్లో అయితే పరిమితంగా ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ వంటి గ్రూపుల్లో 40 సీట్లు మాత్రమే ఉంటాయి. తమ పిల్లలకు రెసిడెన్షియల్ కళాశాలల్లో సీట్లు కావాలని తల్లిదండ్రులు ఐటీడీఏ పీఓకు మొరపెట్టుకోవడంతో ఆయన చొరవతో రెండు, మూడేళ్లుగా అదనంగా మరో 10 సీట్లు కూడా పెంచుతూ వచ్చారు. ఈ ఫలితాల్లో సీతంపేట ఐటీడీఏ పరిధిలో 11 మందికి పైగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 900లకు పైబడి మార్కులు సాధించారు. అలాగే 20 మందికి ఫస్టియర్‌లో 400లకు పైబడి మార్కులు వచ్చాయి.



మల్లిలో ఉన్న ప్రతిభా గురుకుల జూనియర్ కళాశాల

బస్సు ఢీకొని తండ్రీకొడుకుల మృతి

- యాత్రకు వెళ్లి వస్తుండగా ప్రమాదం



ప్రమాదంలో మృతి చెందిన తండ్రీకొడుకులు

బలిజిపేట: మండలంలోని వంతరాం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బలిజిపేట గ్రామానికి చెందిన ముడుసు రామయ్య(30), కుమారుడు పవన్‌కుమార్(3) అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజాం నుంచి ఆటో డ్రైవింగ్ చేసుకుని వస్తుండగా వంతరాం గ్రామం సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తండ్రీకొడుకులు అక్కడికక్కడే మృతి చెందారు. రామయ్య బలిజిపేట గ్రామానికి చెందిన యాదవ కుటుంబీకుడు. ఆయన ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదివారం కుమారుడిని తీసుకుని రాజులమ్మ యాత్రకు వెళ్లి దర్శనం చేసుకున్నారు. తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో వంతరాం సమీపంలో జరిగిన బస్సు ఢీకొని ఇద్దరూ మృత్యువాత పడ్డారు. దీంతో భార్య భవాని, కూతురు రమ్య, కుటుంబసభ్యులు, బంధువులు లబోదిబోమని రోదిస్తున్నారు. రామయ్యకు ఉండడానికి కనీసం ఇల్లుకూడా లేదని, భార్య, కూతురికి ఆరోగ్యం బాగోలేకపోతే రాజులమ్మ మొక్కుతీర్చుకుని వస్తే ఆరోగ్యం కుదుటపడుతుందని భావించిన తండ్రి భార్యను, ఆడపిల్లను ఇంటివద్ద ఉంచి, కొడుకును తీసుకుని వెళ్లాడని బంధువులు తెలిపారు. కుటుంబయజమాని మృతితో భార్య, ఆడపిల్ల నడిరోడ్డున పడ్డారని వాపోతున్నారు. ఈ ఘటనపై మృతుడి భార్య భవాని ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సింహాచలం తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం తరలించినట్లు చెప్పారు.

చెట్టును ఢీకొని టిప్పర్ డ్రైవర్..



నాగరాజు మృతదేహం వద్ద రోదిస్తున్న దుర్గారావు

రేగిడి: మండల పరిధిలోని రెడ్డిపేట జంక్షన్ వద్ద ఆదివారం వేకువజామున ఇసుక కోసం వెళ్తున్న టిప్పర్ చెట్టును ఢీకొనడంతో డ్రైవర్ మృతిచెందాడు. దీనిపై ఎస్సై పి.నీలావతి అందించిన వివరాల ప్రకారం ఆమదాలవలస వద్ద ఉన్న ముద్దాడపేట ర్యాంప్ నుంచి ఇసుకను తీసుకువెళ్లేందుకు సాలూరు నుంచి డ్రైవర్ టిప్పర్‌తో వస్తున్నాడు. రాజాం నుంచి పాలకొండ వైపు వేకువజామున 3గంటల సమయంలో మలుపు వద్ద వాహనం అదుపుచేయలేక చెట్టును బలంగా ఢీకొన్నాడు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో గాయాలపాలైన డ్రైవర్ తన ఫోన్‌లో మిగిలిన డ్రైవర్లకు సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న వారంతా కేబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీసి అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. మృతుడిని అనకాపల్లి జిల్లా కోడూరు మండలం గొల్లపేటకు చెందిన పల్లా నాగరాజు (30)గా గుర్తించామని ఎస్సై తెలిపారు. మృతుడి చిన్నాన్న దుర్గారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తున్నామన్నారు. మృతుడికి భార్య హేమవర్షిణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం సీహెచ్‌సీకి తరలించామన్నారు.

లారీ కింద పడి వ్యక్తి..





లక్ష్మణ్ మృతదేహం, (ఇన్‌సెట్లో) మృతుడు లక్ష్మణ్ (ఫైల్)

కొమరాడ: మండలకేంద్రం కొమరాడ జంక్షన్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తవలస గ్రామానికి చెందిన బిడ్డిక లక్ష్మణ్(55)లారీ చక్రాల క్రింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానికులు, పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం..రాయగడ నుంచి పార్వతీపురం వైపు వెళ్తున్న లారీ రహదారి పక్కగుండా నడిచి వెళ్తున్న లక్ష్మణ్‌ను ఢీకొంది. దీంతో కింద పడిన లక్ష్మణ్ పై నుంచి లారీ చక్రాలు వెళ్లడంతో నుజ్జునుజ్జై పోయాడు. మృతుడికి నలుగురు పిల్లలు, భార్య ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమత్తం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ మద్యపానంపై ఎస్పీ ఆగ్రహం

- మద్యం మత్తులో బైక్ నడిపిన వారిపై 1814 కేసులు

విజయనగరం క్రైమ్: మందు బాబులపై ఎస్పీ వకుల్ జిందల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం తాగి బైక్ నడిపినా, అసభ్యంగా ప్రవర్తించినా, అలాగే మద్యం మత్తులో విచ్చలవిడిగా రోడ్లపైకి వచ్చినా కేసులు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం స్టేషన్‌హౌస్ ఆఫీసర్లకు ఎస్పీ మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. బహిరంగంగా ఎవరైనా మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

మద్యం తాగి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నవారిపై కేసులు పెట్టడంలో వెనకాడవద్దని పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్పీ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా పోలీస్ సిబ్బంది దాడులు నిర్వహించారు. లే అవుట్‌లు, మైదానాలు, చెట్ల ప్రాంతాలు, నగర శివారు ప్రాంతాల్లో డ్రోన్ల సహాయంతో దాడులు చేసి 207 మందిపై కేసులు నమోదు చేశారు. అదేవిధంగా ఇప్పటివరకు బహిరంగంగా మద్యం తాగిన వారిపై 6,275 కేసులు, మద్యం మత్తులో బైక్ నడిపిన వారిపై 18,14 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందల్ చెప్పారు.



బహిరంగంగా మద్యం తాగిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

బొండపల్లి: మండలంలోని గొట్లాం బైపాస్‌రోడ్డుపై ద్విచక్ర వాహనంపై వెళ్తూ డివైడర్‌ను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై యు.మహేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం మండలం గుంకలాం గ్రామానికి చెందిన కలిశెట్టి శ్రీను(32) అంబటివలస వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా డివైడర్‌ను ఢీకొట్టి మృతి చెందాడు. శ్రీను ఇంటికి రాకపోవడంతో మృతుని అన్నయ్య తాతయ్యలు వెతుకుతూ వచ్చి ద్విచక్ర వాహనంతో డివైడర్‌ను రోడ్డు పక్కన శ్రీను మృతిచెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుని అన్నయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

నేడు డా. బీఆర్ అంబేడ్కర్ జయంతి

పార్వతీపురం టౌన్: భారత రాజ్యాగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ జయంతి సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు తన కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళితో కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందన్నారు. అనంతరం సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా వివిధ పథకాల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు, ఆస్తుల పంపిణీ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

దుర్గమ్మకు సంబర నీరాజనం

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ఇష్టమైన ఆదివారాన్ని పురస్కరించుకొని పట్టణ, మండల పరిధిలోని భక్తులు సంబరాలను నిర్వహించారు. నూతన వధూవరులు ఘటాలు, ముర్రాటలు తలదాల్చి దేవస్థానానికి చేరుకున్నారు. అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ, మనిల్‌కుమార్ శర్మ తదితరులు భక్తులు ఇచ్చిన కానుకలను అమ్మవారికి నివేదించారు.

పరీక్ష ఫెయిలయ్యానని..

- మనస్తాపంతో యువతి ఆత్మహత్య

భోగాపురం: మండలంలోని ముంజేరు గ్రామానికి చెందిన మొగసాల స్రవంతి (19) అనే యువతి మనస్తాపం చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వి.పాపారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముంజేరు గ్రామానికి చెందిన స్రవంతి ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈనెల 12వ తేదీన వెలువడిన ఇంటర్‌మీడియట్ ఫలితాల్లో ఫెయిలైంది. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో ఎవరూ లేకపోడవంతో ఆదివారం మధ్యాహ్నం చీరతో ఊయ్యాల హుక్కుకు ఉరివేసుకుంది. స్థానికుల ద్వారా విషయం తెలుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతురాలి తండ్రి సూరిబాబు ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి..

రామభద్రపురం: మండలంలోని ఎస్.సీతారాంపురం గ్రామానికి చెందిన మునకాల వెంకటరమణ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వి.ప్రసాదరావు ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకటరమణ నిత్యం మద్యం తాగుతూ ఉండేవాడు. మూడేళ్లగా మానేశాడు. అయితే మూడు నెలల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఇటీవల రెండు రోజుల నుంచి ఆ నొప్పి కాస్త ఎక్కువవడంతో చిన్న కుమారుడు కార్తీక్ ఆస్పత్రికి తీసుకెళ్లి డాక్టర్‌కు చూపిస్తానని చెప్పినా వినకుండా శనివారం మండలకేంద్రంలోని చిన్నమ్మతల్లి గుడి సమీపంలోని మామిడితోటలో పురుగుమందు తాగేశాడు. దీంతో స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. పెద్ద కుమారుడు పృథ్వీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రసాదరావు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.



వెంకటరమణ మృతదేహం